సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 11 । జనవరి । 2024



అధ్వానంగా గ్రామీణ రోడ్లు

గ్రామీణ రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ప్రమాదకరంగా మారినా పట్టించుకునే వారే లేరు.

- 9లో



ఖోఖోలో విద్యార్థినుల సత్తా

దామరచర్ల గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు.

- 10లో



విద్యుత్ లైన్ వేయొద్దంటూ..

తన వ్యవసాయ పొలంలో నుంచి విద్యుత్ లైన్ వేయొద్దంటూ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

- 10లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి సంక్రాంతి సెలవులు

భువనగిరి : పాఠశాలలకు ఈనెల 12నుంచి 17వ తేదీ వరకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రటించినట్లు డీఈఓ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 18వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయన్నారు. సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

టెన్త్ ఫలితాల్లో అగ్రస్థానంలో నిలపాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

గుండాల : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని డీఈఓ నారాయణరెడ్డి కోరారు. బుధవారం గుండాల మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు, భోజనాన్ని పరిశీలించారు. బోధన తీరు, అభ్యాసన స్థాయిలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సీఆర్‌పీలతో సమావేశం అయ్యారు. పదవ తరగతిలో మంచి ఫలితాలు రాబట్టాలని కోరారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, గుండాల, మోత్కూరు సీఆర్‌పీలు లింగయ్య, వెంకటేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

మోత్కూరు : పట్టణంలోని అంగడిబజార్‌లోని భవిత కేంద్రాన్ని బుధవారం డీఈఓ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. చిన్నారులకు అందజేస్తున్న విద్య, బోధనా అభ్యాసన ప్రక్రియలపై ఆరా తీశారు. అదే విధంగా ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. ఆయన వెంట ఎంఈఓ శ్రీధర్, హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అరుణ, సౌజన్య, లలిత, ఎంఆర్‌సీ సిబ్బంది ఉన్నారు.

నేడు ఓబన్న జయంతి

భువనగిరి టౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ ఒడ్డె ఓబన్న జయంతిని గురువారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగే బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు, అనధికారులు హాజరుకావాలని కోరారు.

ఓట్లు, సీట్లు లేకున్నా ప్రజల్లోనే ఉంటాం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

చౌటుప్పల్ : ఓట్లు, సీట్లు లేకున్నా సీపీఎం నిరంతరం ప్రజల్లోనే ఉంటుందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్న పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల్లో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. తమ పార్టీ ఓట్లు, సీట్ల కోసం ఏనాడూ ఆలోచన చేయలేదన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటం చేసుందన్నారు. రానున్న రోజులు కమ్యూనిస్టు పార్టీలదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజు, బట్టుపల్లి అనురాధ, మల్లేశం, నర్సిరెడ్డి, అశోక్‌రెడ్డి, నర్సింహులు, పాండు, కె.నర్సిరెడ్డి, బి.కృష్ణారెడ్డి, పాష, నర్సింహ, సైదులు, అరుణ్‌కుమార్, లక్ష్మణ్, చంద్రకళ, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ విచారణ

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని మల్లాపురం సర్పంచ్ కర్రె వెంకటయ్యపై బుధవారం డీఎల్‌పీఓ, ఎంపీఓ విచారణ చేశారు. వెంకటయ్య నక్షబాటలో అక్రమంగా భవనం నిర్మిస్తున్నాడని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మంగ సత్యనారాయణ ఇటీవల ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డీఎల్‌పీఓ యాదగిరి, ఎంపీఓ చంద్రశేఖర్ గ్రామానికి వచ్చి విచారణ చేశారు. ఇరు వర్గాల వాదనలు రికార్డు చేసి సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

రూ.40 లక్షల లోపేనట!

అసెంబ్లీ ఎన్నికల్లో గీత దాటని అభ్యర్థులు

- నిబంధనలకు లోబడి వ్యయం
- ఎన్నికల కమిషన్‌కు లెక్కలు
- వెబ్‌సైట్‌లో పొందుపరిచిన అధికారులు



సాక్షి యాదాద్రి : డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు చేసిన ఖర్చు వివరాలను ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తదితర రాజకీయ పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థుల ఖర్చును పైసా లేకుండా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఎన్నికల సంఘానికి అభ్యర్థులు ధాఖలు చేసిన లెక్కల అఫిడవిట్‌లతో సహా వెబ్‌సైట్‌లో ఉంచింది. ఒక్కో అభ్యర్థి రూ.40 లక్షలోపే ఖర్చు చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులైతే పార్టీ ఇచ్చింది కూడా ఖర్చు చేయలేకపోయారు. ఒక్క బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి మాత్రమే పార్టీ ఇచ్చిన మొత్తానికంటే ఎక్కువగా ఖర్చు చేశారు.

నారాయణరెడ్డి ఒక్కరే పార్టీ ఇచ్చిన ఫండ్ కంటే ఎక్కువ ఖర్చు

భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి ఎక్కువ ఖర్చు చేశారు. వీరిద్దరికంటే బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి అధిక మొత్తంలో ఖర్చు పెట్టారు. ఆలేరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కంటే బీర్ల అయిలయ్య అధికంగా ఖర్చు చేశారు.వీరిద్దరితో పోలిస్తే బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్ చాలా తక్కువ ఖర్చు చేశారు. రెండు నియోజకవర్గాల్లోనూ పడాల శ్రీనివాస్‌దే తక్కు వ్యయం.

పార్టీ ఇచ్చిన పైసలు కూడా ఖర్చు కాలే..

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులకు ప్రధాన రాజకీయ పార్టీలు ఫండ్ ఇచ్చాయి. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బీఫాం ఇచ్చిన రోజునే ఒక్కో అభ్యర్థికి రూ.40 లక్షల చొప్పున చెక్‌లు అందజేశారు. ఆలేరులో రూ.15,29,509, భువనగిరిలో రూ.12,74,909 మిగిలినట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులు లెక్కలు చూపారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఆ పార్టీ రూ.30 లక్షల చొప్పున నగదు ఇచ్చింది. ఇందులో ఆలేరులో రూ.51,397, భువనగిరిలో రూ.3,21,070 మిగిలాయి. బీజేపీ అభ్యర్థులకు రూ.25 లక్షల చొప్పున పార్టీ ఇచ్చింది. ఇందులో భువనగిరి బీజేపీ అభ్యర్థి పార్టీ ఇచ్చిన ఫండ్ కంటే రూ.6,13,694 అధికంగా ఖర్చు చేశారు. ఆలేరు అభ్యర్థి రూ.19,66,050 మిగిలినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన లెక్కల్లో చూపించారు.

భువనగిరి అభ్యర్థుల ఖర్చు ఇలా..

గూడూరు నారాయణరెడ్డి (బీజేపీ)

పార్టీ ఇచ్చిన ఫండ్ రూ.25 లక్షలు
ఖర్చు చేసిన నగదు రూ.31,13,694
చేతినుంచి పెట్టుకుంది రూ.6,13,694
బహిరంగ సభలు, ర్యాలీలకు రూ.9,36,668
స్టార్ క్యాంపెయిన్.. రూ.10,33,350
ప్రచారం సమయంలో ఖర్చులు రూ.71,440
పత్రికల్లో ప్రచారం కోసం రూ.1,19,450
ప్రచార వాహనాలకు రూ.6,63,800
ప్రచార కార్యకర్తలు, ఏజెంట్లకు రూ.2,72,600
కేసుల డిక్లరేషన్ ప్రకటనలకు రూ.16,386
మొత్తం ఖంరూ. 31,13,694

కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)

పార్టీ ఇచ్చిన ఫండ్ రూ.30 లక్షలు
ఖర్చు చేసింది రూ.26,78,930
మిగిలిన నగదు రూ.3,21,070
బహిరంగ సభలు, ర్యాలీలు రూ.10,14,788
స్టార్ క్యాంపెయిన్.. రూ.5,21,000
ప్రచార వాహనాలకు రూ.6,16,700
ప్రచార కార్యకర్తలు, ఏజెంట్‌ల ఖర్చు రూ.5,14,000
క్రిమినల్ కేసుల డిక్లరేషన్‌కు రూ.12,442
మొత్తం వ్యయం రూ.26,78,930

పైళ్ల శేఖర్‌రెడ్డి (బీఆర్‌ఎస్)

పార్టీ ఇచ్చిన ఫండ్ రూ.40,00,000
ఖర్చు చేసింది రూ.27,25,091
మిగిలిన నగదు రూ.12,74,909
బహిరంగ సభలు, ఊరేగింపులకు రూ.6,74,347
స్టార్ క్యాంపెయిన్‌కు. రూ.2,55,180
ప్రచార సామగ్రి, బహిరంగ సభలకు రూ.54,486
పత్రికల్లో ప్రకటనలకు రూ.75,553
ప్రచార సమయంలో వాహనాలకు రూ.9,73,600
ఇతర ఖర్చులు రూ.4,34,925
మొత్తం వ్యయం రూ.27,25,091

ఆలేరు అభ్యర్థుల ఖర్చు వివరాలు

బీర్ల ఐలయ్య (కాంగ్రెస్)

పార్టీ ఇచ్చిన ఫండ్ రూ.30 లక్షలు
ఖర్చు రూ.29,48,603
పార్టీ ఫండ్‌లో మిగిలింది రూ.51,397
సభలు, ర్యాలీలకోసం రూ.2,86,388
కోమటిరెడ్డి, రేవంత్‌రెడ్డి బహిరంగ సభలకు రూ.14,78,435
జెండాలు, క్యాప్‌లు, కరపత్రాలకు రూ.1,30,271
ప్రచార వాహనాలకు రూ.9,52,100
వ్యక్తిగత పనులకు నియమించుకున్న వారికి రూ.30.900
పత్రికల్లో ప్రకటనల ఖర్చులు రూ.70,509
మొత్తం వ్యయం రూ.29,48,603

గొంగిడి సునీత (బీఆర్‌ఎస్)

పార్టీ ఇచ్చిన ఫండ్ రూ.40 లక్షలు
చేసిన ఖర్చు రూ.24,70,491
మిగిలింది రూ.15,29,509
బహిరంగ సభలు, ర్యాలీలకు రూ.6,23,900
స్టార్ క్యాంపెయిన్‌కు రూ.2,51,555
సీఎం సభకు రూ.3,60,605
పత్రికల్లో ప్రకటనలు రూ.91,200
ప్రచార వాహనాలకు రూ.10,87,500
ప్రచారకర్తలు, ఏజెంట్‌లకు రూ.20,000
క్రిమినల్ కేసుల డిక్లరేషన్ ప్రకటనలకు కోసం రూ.35,731
మొత్తం వ్యయం రూ. 24,70,491

పడాల శ్రీనివాస్ (బీజేపీ)

పార్టీ ఇచ్చిన ఫండ్ రూ.25 లక్షలు
చేసిన ఖర్చు రూ.5,33,950
మిగిలిన నగదు రూ.19,66,050
ప్రచారం, రవాణా వాహనాలకు రూ.1,34,250
పూలదండలు, శాలువాలకు రూ.31,400
పోస్టర్‌లు, కరపత్రాలు, బ్యానర్లకు రూ.1,40,000
మీడియాలో ప్రకటనలకు రూ.19,800
ప్రముఖులు వచ్చినప్పుడు, కళాకారులకు రూ.1,68,500
సభా వేదికలకు రూ.4,000
మొత్తం వ్యయం రూ. 5,33,950



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

'హిట్ అండ్ రన్'ను రద్దు చేయాలి

భువనగిరిటౌన్ : కేంద్రం ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రమాదం జరిగితే హిట్ అండ్ రన్ చట్టం పేరుతో డ్రైవర్‌కు రూ.7 లక్షలు జరిమానా, పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అనుకోని పరిస్థితుల్లోనే ప్రమాదాలు జరుగుతుంటాయని, కావాలని ఎవరూ చేయరన్నారు. వెంటనే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, కుమార్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

- నాబార్డు సీజీఎం సుశీల చింతల

బొమ్మలరామారం : రైతులు పంటల సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంభించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల సూచించారు. బొమ్మలరామారం మండలం సోలిపేట్ గ్రామంలో మేలైన సాగు విధానాలపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ.. ప్రపంచానికి ఆహారం అందించే సత్తా భారతదేశ రైతులకే ఉందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలను అందించేందుకు నాబార్డ్ సహకారం అందజేస్తుందన్నారు. రైతులకు మేలైన యాజమాన్య పద్ధలతో పాటు సలహాలు, సూచనలు అందించేందుకు ప్రాజెక్టును రూపొందించిన



మాట్లాడుతున్న నాబార్డు సీజీఎం

శాస్త్రవేత్త డాక్టర్ మధుబాబును అభినందించారు. హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్తలు రైతులకు కూరగాయల సాగు, మార్కెటింగ్, మట్టి పరీక్షలు, మేలైన వంగడాల ఎంపికలో మెలకువలపై అవగాహన కల్పించారు. సోలీపేట ధీశాలి రైతు ఉత్పాదక సంస్థకు సదస్సుతో మేలు జరిగిందన్నారు. జీఎంఎం అధ్యక్షురాలు దూబల విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాబార్డ్ అధికారి వినయ్‌కుమార్, ధీశాలి మహిళా రైతు సంఘం అధ్యక్షురాలు సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'ని కొనసాగించాలి

భువనగిరిటౌన్ : గృహలక్ష్మి పథకాన్ని కొనసాగించాలని కోరుతూ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పార్టీ నాయకులతో కలిసి బుధవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కల నేరవేర్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీంతో పాటు పేదల అభివృద్ధికి దోహదపడే ప్రతి పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బూరు



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీరు మల్లయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, భువనగిరి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జనగాం పాండు పాల్గొన్నారు.

ఎపిక్ కార్డు తప్పనిసరి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షి, యాదాద్రి : వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు ఓటు నమోదు కోసం ఎపిక్ కార్డు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు ఫారం–18 దాఖలు చేయడానికి ఫిబ్రవరి 6 చివరి తేదీ అని, ఫిబ్రవరి 24తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. 24 నుంచి మార్చి 14వ తేదీ వరకు చేర్పులు, మార్పులు, తొలగింపునకు దరఖాస్తులు స్వీకరించాలని, ఏప్రిల్ 4న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు.చేర్పులు, తొలగింపుల కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తు చేయవచ్చని, లేదా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ ceotserms2.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎపిక్ కార్డు ఏ నియోజకవర్గానికి సంబంధించి ఉంటే అదే నియోజక వర్గంలో ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఎపిక్ కార్డు వెంట ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ జిరాక్సు జత చేయాలని తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్ సంబంధించి ఎన్నికల సంఘం యూనివర్సిటీల లిస్ట్ పంపుతుందని, దాని ప్రకారం పరిశీలించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, మాస్టర్ ట్రైనర్ నర్సిరెడ్డి ఎన్నికల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు శిక్షణ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్

గొర్రెల యూనిట్‌లు పంపిణీ చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, పాల్గొన్న నాయకులు

- కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారుల నిరసన

భువనగిరిటౌన్ : గొర్రెల కోసం డీడీలు చెల్లించిన గొల్లకురుమలకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని, లేకుంటే డీడీల డబ్బులైనా ఇవ్వాలని గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా యాదాద్రి జిల్లాలో సుమారు 500 మంది గొల్లకురుమలు డీడీలు చెల్లించారని పేర్కొన్నారు. ఒక్కొక్కరు రూ.43,750 చొప్పున డీడీల రూపంలో కలెక్టర్ ఖాతాలో జమ చేశారని వివరించారు.వారందిరికీ యూనిట్‌లు అందజేయాలని, లేకపోతే డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఆదోళన చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని, గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగించి గొల్ల, కురుమలకు న్యాయం చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. అనంతరం వినతిపత్రం ఇవ్వడానికి కలెక్టరేట్‌లోకి వెళ్లగా సీసీకి, బాలరాజు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సీసీ నిర్లక్ష్యంగా మాట్లాడంటూ బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అయోధ్య యాదవ్, సుక్కల సత్యం అఖిల భారత యాదవ సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, పుట్ట వీరేష్, గొర్రెల పెంపదారుల డైరెక్టర్లు జెల్లి నర్సింహులు, డేగల పాండు, సూర్యనారాయణ, గుండెబోయిన వెంకటేష్, రేకల శ్రీనివాస్, కంకల మహేష్, మర్రి నర్సింహ, గుండెబోయిన బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో 'అభయహస్తం'

- ముమ్మరంగా దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు
- 65 శాతానికి పైగా పూర్తి
- అత్యధికంగా రామన్నపేట మండలంలో..

రామన్నపేట : ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియ చేపట్టారు. 421 గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీల్లో 525 గ్రామ సభలు నిర్వహించారు. ఆయా సభల్లో 2,64,922 దరఖాస్తులు వచ్చాయి. జనవరి 6వ తేదీ నుంచి దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రారంభించారు. 65శాతానికి పైగా పూర్తయ్యాయి.

చేతిలోనే అప్లికేషన్ స్టేటస్..

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి ప్రభుత్వం prajapalana.telangana.gov.in వెబ్‌సైట్‌ను రూపొందించింది. దరఖాస్తులోని వివరాలను వెబ్‌సైట్‌లో విజయవంతంగా నమోదు చేయగానే నంబర్ వస్తుంది. ఆపరేటర్ ఆ నంబర్‌ను దరఖాస్తు ఫారంపై వేస్తాడు. దరఖాస్తుదారుడి సెల్‌ఫోన్‌కు కూడా ఆన్‌లైన్ అప్లికేషన్ నంబర్ మెసేజ్‌రూపంలో వెళ్తుంది. నంబర్ ద్వారా దరఖాస్తుదారుడు తన అప్లికేషన్ స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. వివరాలను ఒకసారి నమోదు చేసిన తరువాత మార్చే వెసులుబాటు లేదు.



రామన్నపేటలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

గడువులోపు పూర్తయ్యేలా కార్యాచరణ

నిర్ణీత గడువులోగా అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 525 కౌంటర్లు ఏర్పాటు చేశారు. 562 ఆపరేటర్లను నియమించారు. ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసి నెట్ సౌకర్యం కల్పించారు. అవసరమైన కంప్యూటర్లను ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఫౌండేషన్‌ల నుంచి సేకరించారు. పంచాయతీ కార్యదర్శులకు గ్రామాలవారీగా బాధ్యతలు అప్పగించారు. వారికి బిల్‌కలెక్టర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆశా, అంగన్‌వాడీ టీచర్లను సహాయకులుగా నియమించారు. వీరితో పాటు వివిధ శాఖల అధికారులు ఆన్‌లైన్ నమోదును పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17లోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్తున్నారు. ఒక్కో దరఖాస్తు నమోదుకు గాను ఆపరేటర్‌కు రూ.5 ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు తెలుస్తుంది.

రామన్నపేట మండలంలో ఇలా..

జిల్లాలోని 17 మండలాల్లో రామన్నపేట ముందు వరుసలో ఉంది. మండల వ్యాప్తంగా 18,463 దరఖాస్తులు రాగా 7వేలకు పైగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ముందువరుసలో ఉన్నాం

దరఖాస్తుల ఆన్‌లైన్‌లో రామన్నపేట మండలం ముదు వరుసలో ఉంది. మొత్తం 18,463 దరఖాస్తులు రాగా 7వేలకు పైగా ఆన్‌లైన్ చేశాం. అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు సహకరిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మరో ఐదారు కంప్యూటర్లను అధనంగా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. గడువులోగా ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేస్తాం.

–జలేందర్‌రెడ్డి,ఎంపీడీఓ, రామన్నపేట

మధ్యప్రదేశ్ మాజీ సీఎంకు స్వాగతం

భువనగిరి : మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు బుధవారం భువనగిరిలో బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ బుధవారం వరంగల్ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో భువనగిరిలో కాసేపు ఆగారు. ఆయనకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, పోతంశెట్టి రవీందర్, పడాల శ్రీనివాస్, నర్ల నర్సింగ్‌రావు, చందా మహేందర్ గుప్తా, మాయ దశరథ, బలరాం, ఉమాశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సన్మానిస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు, నాయకులు

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

సాక్షి,యాదాద్రి : సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యుడు బీర్ల అయిలయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆలేరు నియోజకవర్గ సాగునీటి పథకాలపై జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి సమీక్షించారు. బస్వాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ 14, 15, ప్యాకేజీ 16 కాలువలు, బునాదిగాని కాలువల పురోగతి, భూసేకరణపై నీటి పారుదల, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ, వైటీడీఏ అధికారులతో చర్చించి తగు సూచనలు చేశారు. అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఆలేరు నియోజకవర్గానికి పది విద్యుత్ సబ్ స్టేషన్‌లు మంజూరు అయ్యాయని, వాటికి స్థల సేకరణ చేయాలని సూచించారు. బునాదిగాని కాలువ పెండింగ్ పనుల అంచనా ప్రతిపాదనలు, నృసింహాసాగర్ ముంపు గ్రామాలైన లప్పానాయక్‌తండా, చోక్లా తండాల భూసేకరణ, ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి నిధులు అవసరమని అధికారులు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువచ్చారు.



మ్యాప్ ద్వారా సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

రెండు రోజుల్లో భూ సేకరణ పూర్తికావాలి

నీటిపారుదల, చెరువులు, చెక్ డ్యాంలు, రోడ్ల పనులకు సంబంధించి ప్రణాళికలు సమర్పించాలని, విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు రెండు రోజుల్లో స్థల సేకరణ పూర్తి చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి, ఆర్డీఓ అమరేందర్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శంకరయ్య, పీఆర్ ఈఈ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్య కేసుపై డీఎస్పీ విచారణ



హతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

మద్దిరాల: ఇటీవల చోటు చేసుకున్న హత్య కేసుపై బుధవారం సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం మద్దిరాల మండల కేంద్రంలో విచారణ జరిపారు. మండల కేంద్రానికి చెందిన కుంచం కళమ్మ(46)ను ఆమె భర్త వెంకన్న ఆస్తి తగాదాల నేపథ్యంలో హత్య చేసిన విషయం తెలిసిందే. కేసు విచారణలో భాగంగా సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం మద్దిరాలలో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు, సాక్షులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట సీఐ బ్రహ్మమురారి, ఇంచార్జి ఎస్ఐ సైదులు, ఏఎస్ఐ నాగయ్య, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

అభ్యుదయ కవి బాలయ్య మృతి



గోదాసు బాలయ్య (ఫైల్)

రామన్నపేట: రామన్నపేట పట్టణానికి చెందిన అభ్యుదయ కవి గోదాసు బాలయ్య బుధవారం మృతిచెందాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాలయ్య ప్రజా సమస్యలపై, సమాజంలోని పోకడలపై, విప్లవ భావాలతో కూడిన అనేక రచనలు చేసి అభ్యుదయ కవిగా పేరుపొందారు. బాలయ్య మృతదేహాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్, మాజీ సర్పంచ్ ఆకవరపు మధుబాబుతో పాటు వార్డు సభ్యులు లెంకల ప్రవీణ్ నివాళులర్పించారు.

హత్య ఘటన స్థలం పరిశీలన



హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం తెలగ రామయ్యగూడెంలో ఈనెల 2న సోమగాని లీలమ్మ హత్యకు గురైన విషయం తెలిసిందే. బుధవారం ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. లీలమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలై వివిధ ప్రాంతాల్లో ఉంటుండగా లీలమ్మ ఒక్కతే ఇంటి వద్ద ఉంటోంది. లీలమ్మ హత్యకు గల కారణాలను ట్రైనీ ఐపీఎస్ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తదితరులున్నారు.

రైతులకు సాగు నీరు అందించాలి

మోతె : రైతులకు సాగు నీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు విడుదల చేసిన సందర్భంగా చివరి ఆయకట్టు అయిన మోతె నడిగూడెం మండలాలకు సాగు నీరు అందించే దిశలో అధికారులు తచర్యలు తీసుకోవాలన్నారు.

మోటారు వైర్లు చోరీ

ఆలేరురూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటారు వైర్లను అపహరించారు. ఈ ఘటన ఆలేరు మండలంలోని గుండ్లగుడెం గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన దూసరి అంజయ్య, దేవిరెడ్డి గోపాల్‌రెడ్డితో పాటు మరికొందరి మోటారు వైర్లను దుండగులు అపహరించుకుపోయారని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సీసీఐ కేంద్రంలో పత్తి రైతుల ఆందోళన

- తూకంలో తేడా, తరుగు పేరుతో కోతలపై రైతుల ఆగ్రహం



సీసీఐ కేంద్రం సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న రైతులు

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ వద్ద గల కాటన్‌మిల్‌లో కొనసాగుతున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద బుధవారం రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అధికారులు దళారులతో కుమ్మక్కై పత్తి కొనుగోలులో అనేక రకాలుగా మోసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తూకంలో మోసం చేయడంతో పాటు తరుగు, నాణ్యత పేరుతో క్వింటాలుకు 5 నుంచి 10కిలోలు కోతలకు పాల్పడుతున్నారన్నారు. పత్తిధర విషయంలో కూడా ప్రభుత్వం క్వింటాలుకు రూ.7020 మద్దతు ధర ప్రకటిస్తే నాణ్యతాలోపం పేరుతో రూ.6900 ధర చెల్లిస్తున్నారంటూ సీసీఐ అధికారులతో రైతులు తీవ్ర వాగ్వాదం చేశారు. వేబ్రిడ్జి తూకంలో వచ్చిన తేడాపై సంబంధిత సిబ్బందితో రైతులు వాగ్వాదం చేస్తుండగా పరిస్థితి చేయిదాటడంతో ఘర్షణ పడ్డారు. వెంటనే అక్కడున్న కొంతమంది రైతులు ఘర్షణను నిలువరించారు. వేబ్రిడ్జి తూకంలో తేడాలు లేవని, ఒక వాహనాన్ని తూకం వేసిన తర్వాతా మరో వాహనం తూకం వేసేముందు కంప్యూటర్‌లో జీరో చేయాల్సి ఉంటుందని కాటన్‌విల్లు సిబ్బంది రైతులకు వివరించారు. అందుకోసం మరోమారు తూకం వేసి పరిస్థితిని వివరించడంతో రైతులు తూకం విషయంపై శాంతించారు. సీసీఐ కేంద్రానికి శాలిగౌరారం, నకిరేకల్ మండలాల నుండి సుమారు 50 ట్రాక్టర్లు పత్తిలోడ్లతో రాగా 26 ట్రాక్టర్లను మాత్రమే కాటన్‌మిల్లులోకి అనుమతించి పత్తిని కొనుగోలు చేశారు. మరో 24 ట్రాక్టర్లు కాటన్‌మిల్లు బయటనే నిలిచి ఉండటంతో మొత్తం పత్తిని కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. రైతుల ఆందోళన నేపథ్యంలో కాటన్ మిల్లు యజమాని సీసీఐ అధికారులతో మాట్లాడి బయట ఉన్న 24 ట్రాక్టర్లను రాత్రి కొనుగోలు కేంద్రం లోపలికి అనుమతింపజేశారు. దీంతో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పత్తి రైతుల ఆందోళన రాత్రి 9గంటలకు పత్తిలోడు ట్రాక్టర్లను కొనుగోలు కేంద్రం లోపలికి అనుమతించడంతో ముగిసింది.

సాగర్‌కు జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న అధికారులు

నాగార్జునసాగర్: జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తశి రబ్‌స్తాన్ బుధవారం నాగార్జునసాగర్‌కు తన కుటుంబంతో వచ్చారు. వీరికి డిప్యూటీ తహశీల్దార్ శరత్‌చంద్ర, నిడమనూరు కోర్టు సిబ్బంది స్వాగతం పలికారు. జస్టిస్ తశి రబ్‌స్తాన్ గురువారం సాగర్ ప్రాజెక్టుతో పాటు బుద్ధవనం, నాగార్జునకొండను సందర్శించనున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



దుర్గాబాయి మృతదేహం

కోదాడరూరల్ : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందింది. ఈ ఘటన కోదాడ పట్టణంలోని పాతపోస్టాఫీసు వీధిలో బుధవారం చోటు చేసుకుంది. కోదాడ మండలం మంగళితండాకు చెందిన రమావత్ విజయదుర్గాబాయికి (28)కు నాగార్జునసాగర్ రైట్‌బ్యాంక్‌కు చెందిన రాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారు కోదాడ పట్టణంలోని భవానీనగర్‌లో నివసిస్తూ పాతపోస్టాఫీసు బజారులో బట్టల దుకాణం నడుపుతున్నారు. ఆరు నెలలుగా భర్త ఆమెను అనుమానంతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె బుధవారం బట్టల దుకాణంలోని స్టోర్‌రూంలో ఉరేసుకుంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసేవరకు మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు మాత్రం భర్తే చంపి ఫ్యాన్‌కు ఉరేసాడని ఆరోపిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై మృతురాలి తండ్రి బావ్ సింగ్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



చిట్యాల: వెలిమినేడులో పీఏసీఎస్ చైర్మన్ అవిశ్వాస తీర్మాన సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్‌లు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షంపై ఆ సొసైటీ డైరెక్టర్‌లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం సొసైటీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ రుద్రారపు భిక్షం హాజరకాలేదు. మరో డైరెక్టర్ కోనేటి లింగయ్య కొంతకాలం క్రితం మృతి చెందాడు. 11 మంది డైరెక్టర్లలో వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, డైరెక్టర్లు పిశాటి భీష్మారెడ్డి, ఏనుగు రఘుమారెడ్డి, గడ్డం సత్తిరెడ్డి, టేకుల కవిత, మేడి అచ్చమ్మ, మామిడి శ్రీరాములు, ఎదుళ్ల అజిత్ రెడ్డి, మురాల గోపయ్య, గంగాపురం భాస్కర్, బోయపల్లి స్వామి ఈ అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరయ్యారు. డీసీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సహకార సంఘాల క్లస్టర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు విజయ్‌కుమార్, షణ్ముఖచారి సమక్షంలో సమావేశం నిర్వహించారు. చైర్మన్ భిక్షంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి 11 మంది డైరెక్టర్‌లు చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో పీఏసీఎస్ చైర్మన్ భిక్షంపై అవిశ్వాసం నెగ్గిందని డీసీఓ ప్రకటించారు. గురువారం ఉదయం 11 గంటలకు సొసైటీ కార్యాలయలలో నూతన చైర్మన్ ఎన్నిక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మాన సమావేశం అనంతరం ఓటింగ్‌లో పాల్గొన్న 11 మంది డైరెక్టర్లు క్యాంపునకు తరలి వెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును నిర్వహించారు.

వేతన సవరణ చేపట్టాలని ధర్నా



కోదాడలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

కోదాడఅర్బన్ : వేతన సవరణ చేపట్టాలని కోరుతూ కోదాడ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆ సంస్థ ఉద్యోగులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడారు.పాత పింఛన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘం నాయకులు కోరారు. దేశంలో 30కోట్లకు మంది పైగా బీమా అందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. కార్యక్రమంలో క్లాస్-1 అధికారులు ఎండీఎం సంజీవయ్య, శ్యాంబాబు, రామారావు, డెవలప్‌మెంట్ అధికారులు మల్లం రమేష్, ఆదినారాయణ, అంజిరెడ్డి, యూనియన్ కార్మిక సంఘం నాయకులు విజయ శంకర్, బికన్నయ సువర్ణరాణి, కరుణానాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

సూర్యాపేట క్రైం : సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఇద్దరు వ్యక్తులు అమాయకుల నుంచి రూ.లక్షలు వసూలు చేశారు. ఆగ్రహించిన బాధితులు మోసగించిన వ్యక్తి భార్యను చితకబాదారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేటలోని చంద్రన్నకుంటకు చెందిన చింతా సతీష్, నబీలు ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగో తరగతి ఉద్యోగాలు ఇప్పిస్తామని సుమారు 30మంది నుంచి రూ.48లక్షలు వసూలు చేశారు. ఈ విషయమై గతంలోనే వీరిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది. ఉద్యోగం రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు సతీష్ భార్య కళ్యాణిని బుధవారం స్థానిక ముత్యాలమ్మ గుడిలో బంధించి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఇచ్చిన డబ్బులకు కనీసం అప్పు పత్రమైనా రాసి ఇవ్వాలని కోరారు. ఆమె అందుకు అంగీకరించకపోవడంతో చితకబాదారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని ఆమెను విడిపించి పంపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

భువనగిరి క్రైం: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులో బుధవారం చోటు చేసుకుంది. భువనగిరి మండలం సూరెపల్లి గ్రామానికి చెందిన భరత్ తన బైక్‌పై భువనగిరి పట్టణ శివారులోని పెద్ద చెరువు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న డీసీఎం వాహనం ఒక్కసారిగా యూటర్న్ తీసుకుని భరత్ నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భరత్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని ఆరోపణ

నూతనకల్ : మండల పరిధిలోని చిన నెమిల క్రాస్ రోడ్డులో గల నయారా పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్ అమ్ముతున్నారని వినియోగదారులు ఆరోపించారు. బుధవారం ఆ బంక్‌లో మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన నర్సింగ్ లింగయ్య రూ.200పెట్రోల్‌ను బాటిల్‌లో పట్టుకున్నాడు. అదే విధంగా చిన నెమిల గ్రామానికి చెందిన మంగదుడ్ల శేఖర్ రూ.100పెట్రోల్ బాటిల్‌లో పట్టగా ఇద్దరివి వేర్వేరు రంగులో ఉండడమే కాకుండా వాసన కూడా తేడా ఉందని వినియోగదారులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కిరాణ దుకాణంలో చోరీ

కొండమల్లేపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు కిరాణ దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన వీరమళ్ల ఎల్లయ్య కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. బుధవారం తిరిగి దుకాణం తెరిచే సరికి సామాన్లు చిందరవందరగా ఉండడాన్ని గమనించగా చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. వెంటిలేషన్‌ను తొలగించి అక్కడి నుంచి లోపలికి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.10వేల విలువైన కిరాణ సామగ్రితో పాటు రూ.8వేల నగదును అపహరించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయినట్లు తెలిపాడు.

ప్రభుత్వ విధానాలపై సంఘటిత పోరు

రామగిరి(నల్లగొండ) : కేంద్ర ప్రభుత్వ విధానాలపై సంఘటిత పోరు తప్పదని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (సీసీఈయూ) సభ్యులు హెచ్చరించారు. బుధవారం నల్లగొండలోని ఎల్ఐసీ కార్యాలయం ముందు సంస్థ ఉద్యోగులు సమ్మె చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ కొత్తగా స్టాఫ్ రిక్రూట్‌మెంట్ చేయాలని, జీఎస్టీని తొలగించాలని, వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నవీన్‌గౌడ్, కృష్ణయ్య, డీఓలు గురుమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

బీబీనగర్: బైక్‌పై గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బోడుప్పల్, నాగర్‌కర్నూల్‌కు చెందిన మహమ్మద్ సమీర్, దీకొండ పవన్ కల్యాణ్‌లు, గడ్డం శోభన్‌లు ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు వద్ద మూడు ప్యాకెట్ల గంజాయిని సేకరించారు. దానిని హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 13కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేంధర్ తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి



గాయపడిన జింక

సూర్యాపేట రూరల్ : కుక్కల దాడిలో జింక మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట మండల పరిధిలోని యర్కారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఫారెస్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యర్కారం గుట్టల నుంచి తప్పిపోయి గ్రామంలోకి వచ్చిన జింకను కుక్కలు వెంబడించి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన గ్రామస్తులు సూర్యాపేట ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకొని జింకను పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. గురువారం సూర్యాపేట పశువుల వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎఫ్ఆర్ఓ ఆఫీస్‌ఖాన్ తెలిపారు.

కుక్కదాడిలో పలువురికి గాయాలు



గాయపడిన చెన్నమ్మ

మఠంపల్లి: కుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెంలో చోటు చేసుకుంది. రఘునాథపాలెం గ్రామ శివారులో మిర్చితోటలో కూలీలు పని చేస్తుండగా కుక్క అకస్మాత్తుగా వచ్చి దాడి చేసింది. దాడిలో గ్రామానికి చెందిన కూలీలు భూసిపల్లి చెన్నమ్మతో పాటు ఉమా, హనుమంతుగూడేనికి చెందిన లక్ష్మి, మఠంపల్లికి చెందిన ప్రశాంతి, దేవ్లాతండాకు చెందిన బానోతులక్ష్మితో పాటు పలువురికి గాయాలపాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. బాధితులు స్థానికంగా చికిత్స పొందుతున్నారని తెలిపారు.

పదిమంది జూదరుల అరెస్ట్

త్రిపురారం : మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామ శివారు పరిధిలో డంపింగ్ యార్డు వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు స్థానికులతో నమ్మదగిన సమాచారం రావడంతో దాడులు చేసి పదిమందిని అరెస్ట్ చేశామని ఎస్ఐ వీర శేఖర్ తెలిపారు. పేకాట ఆడుతున్న వీరి నుంచి రూ. 3 వేల నగదు, 6 సెల్‌ఫోన్‌లు, 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై 19న విచారణ

- నోటీసులు జారీ చేసిన తహసీల్దార్
- ఆధారాలు చూపకపోతే భూమి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మకాలనీలోని చింతపల్లి శివారులో సర్వే నంబర్ 5 లోని ప్రభుత్వ భూమి కబ్జాపై అధికారులు దృష్టి సారించారు. ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడే పనిలో నిమగ్నమయ్యారు. ఉన్న భూమిని రికార్డుల్లో అక్రమంగా పెంచి కొందరు ధరణిలో పేరు నమోదు చేయించుకోగా ఆ అక్రమాలపై «సాక్షి» ఇటీవల కథనంతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. సర్వే నంబర్ 5లో ఎంత భూమి ఉంది, వాస్తవానికి ఎంతమందికి అసైన్‌మెంట్ చేశారు.. ఎవరెవరూ అనధికారికంగా పేర్లు ఎక్కించుకున్నారు అనే వివరాలను సేకరించారు. పహాణీల ఆధారంగా రికార్డుల్లో ఉన్న 16మందికి నోటీసులు జారీ చేశారు. తమకు ప్రభుత్వ భూమి ఎలా సంక్రమించిందో దానికి సంబంధించిన ఆధారాలు, సర్టిఫికెట్లు ఈనెల 19వ తేదీలోగా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. పూర్తి ఆధారాలను సమర్పించాలని, లేనిపక్షంలో భూమిని తిరిగి స్వాధీన పరుచుకుంటామని, అక్రమాలకు పాల్పడినట్లు తేలితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరిబాబు హెచ్చరించారు.

ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నల్లగొండ: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అంతకుముందు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి భిక్షపతి, విజయ్ కుమార్, యానం విజయ్‌కుమార్, ఉదావత్ లచ్చీరాం, మాతంగి ప్రభాకర్, బొడ్డు హుస్సేన్, పాల్వాయి వెంకటయ్య, బోయ రాములు, బొల్లెద్దు కరుణాకర్, దుబ్బాక యాదయ్య పాల్గొన్నారు.

పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకం



సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర

పెద్దవూర: పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ పేర్కొంటున్నారు. ఏయే దశల్లో ఎంత మోతాదులో ఏయే ఎరువులు వాడాలనే విషయంపై రైతులు పూర్తిగా వగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు. ఎరువుల వాడకంలో తగు జాగ్రత్తలు పాటించాలని తెలుపుతున్నారు. ఎరువుల వినియోగానికరి సంబంధించి రైతులు పాటించాల్సిన పద్ధతులను ఆయన వివరించారు.



పెద్దవూరలో యూరియాను చల్లుతున్న రైతు

సేంద్రియ ఎరువులతో ఎంతో మేలు

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది. నేలకు సేంద్రియ పదార్థాలు జీవం వంటివి. సేంద్రియ ఎరువుల వలన అన్ని రకాల పంటలకు పోషకాలు అందుతాయి. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సొంతంగా వాటిని తయారు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. ఆ దిశగా రైతులు ఆలోచిస్తే నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించవచ్చు. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.

రసాయనిక ఎరువులతో నష్టం

రసాయనిక ఎరువుల వాడకం శ్రేయస్కరం కాదు. దీనివలన పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారంలో మార్పులు సంభవిస్తాయి. మరోవైపు పంట ఉత్పత్తుల్లో రసాయనిక అవశేషాలు మిగిలి ఉండి మార్కెట్లో దాని ప్రభావంతో డిమాండ్ తగ్గి ధరలు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది. విరివిగా, విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వాడటం తగ్గించాలి. వీటి వాడకం వలన క్రమేపీ పంట దిగుబడులు కూడా తగ్గుతాయి.



పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్ణీత వరుసల్లో మొక్కలు ఉన్నప్పుడు పొలాన్ని 2 అంగుళాల మేర లోతు చేసుకుని తేమ ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరవులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చేసుకోవాలి.

ఏ దశలో, ఏ సమయంలో ఎరువులు వాడాలంటే..

పంటలకు నత్రజని అవసరం చివరి దశ వరకు ఉంటుంది. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో రెండు మూడు కీలక దశల్లో వాడుకోవాలి. ఏపుగా పెరిగేందుకు, పూత, మొగ్గ దశ, పంట దిగుబడి పెరిగే దశల్లో ప్రధానంగా వాడుకోవాలి.నత్రజనిని యూరియా రూపంలో వాడే సమయంలో వృథాని అరికట్టడానికి పైన చెప్పిన మిశ్రమాలను ఉపయోగించాలి. భాస్వరం ఎరువును మొత్తం మోతాదును విత్తే సమయంలో చివరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో ఎరువు భూమిలో నిల్వ ఉండి కొద్దికొద్దిగా పంటకు అందుతుంది. పొటాష్ ఎరువులు మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచటంతో పాటు నాణ్యత కలిగిన ఉత్పత్తి వచ్చేలా చేస్తాయి.

ఎరువుల ధరలపై అవగాహన అవసరం

ఎరువుల వాడకం ఎంత ముఖ్యమో వాటి ధరలపై అవగాహన కలిగి ఉండటం కూడా అంతే ముఖ్యం. ఏయే ఎరువుల్లో ఏ శాతం ఎంత ఉంటుంది. నాణ్యత, ధరలు, నకిలీలు వంటి వాటిని గమనించాలి. దీనికి వ్యవసాయ అధికారులు, అవగాహన ఉన్న రైతుల సలహాలు తీసుకోవాలి. పోషకాలను దష్టిలో పెట్టుకుని కొనుగోలు చేయాలి. ప్రతి ఎరువు బస్తా మీద దానిలో ఉన్న పోషక విలువల శాతం స్పష్టంగా ఉంటుంది. అయితే సూచించిన దానికంటే పోషక విలువలు సగం శాతం మాత్రమే ఉంటాయనే విషయాన్ని గమనించాలి.